ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శుక్రవారం 8 మార్చి 2024



ఉప్పొంగిన అభిమానం: మడకశిర సిద్ధం సభలో శ్రేణుల కేరింతలు



ఇది.. మామాట: హిందూపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న టీడీపీ శ్రేణులు

యువ నేతకు నీరాజనం..

శంఖారావం సభలు సూపర్ సక్సెస్

తొలిరోజు జనసంద్రం నడుమ సభలు

శ్రేణుల్లో ఉత్సాహం నింపిన నారా లోకేశ్ ప్రసంగం

నేడు పుట్టపర్తి, కదిరిలో కార్యక్రమాలు



మడకశిర సభలో నారా లోకేశ్ అభివాదం



మహిళల ఉత్సాహం

పుట్టపర్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్‌కు జనం నీరాజనం పలికారు. శంఖారావం యాత్రలో భాగంగా జిల్లాలో తొలిరోజు గురువారం హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో సభలు నిర్వహించారు. అన్ని సభలు జనసంద్రాన్ని తలపించాయి. అన్నిచోట్లా నారా లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. ఆయన ప్రసంగిస్తున్నంతసేపు జనం చప్పట్లతో మార్మోగించారు. ఈలలు, కేరింతలతో సభాప్రాంగణాలు మార్మోగాయి. ఉమ్మడి అనంత జిల్లా కర్మభూమి అనీ, ఇక్కడ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి, తిమ్మమ్మ మర్రిమాను, పుట్టపర్తి ఉన్నాయని లోకేశ్ పేర్కొన్నారు. హిందూపురం టీడీపీకి కంచుకోట అనీ, తమ కుటుంబాన్ని ఎంతగానో ఆదరించిందన్నారు. నియోజకవర్గ ప్రజల రుణం ఎలా తీర్చుకోవాలా అని ఆలోచిస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ లోకేశ్ ప్రసంగం సాగింది. వైసీపీ పాలనలో పడకేసిన అభివృద్ధి, సాగించిన విధ్వంసాన్ని కళ్లకు కట్టారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల అవినీతి, దురాగతాలను ఎండగట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ ప్రాంత అభివృద్ధి బాధ్యత తీను తీసుకుంటానని ఉద్ఘాటించారు. నారా లోకేశ్ ప్రసంగంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, జనం పులకించిపోయారు. తొలిరోజు సభలు సక్సెస్ అవడం పట్ల టీడీపీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. శుక్రవారం పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో శంఖారావం సభలు నిర్వహించనున్నారు. సభలను విజయవంతం చేసేందుకు టీడీపీ నేతలు భారీ ఏర్పాట్లు చేపట్టారు.



మేము సైతం: టీడీపీ జెండాతో చిన్నారులు



ఎయ్.. దరువెయ్..: కార్యకర్తల నృత్యం



పెనుకొండలో సూపర్ సిక్స్ పథకాల కిట్‌ను అభ్యర్థి సవితకు అందజేస్తున్న లోకేశ్



మడకశిరలో స్వాగతం పలుకుతున్న అభ్యర్థి సునీల్‌కుమార్

నేడు మహాశివరాత్రి

ఆలయాలు ముస్తాబు

లేపాక్షిలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



విద్యుత్ వెలుగుల్లో హిందుపురం బసవనపల్లి శివాలయం

లేపాక్షి, మార్చి 7: మహాశివరాత్రి పర్వదినానికి జిల్లాలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని భక్తులతో ఆలయాలు కిటకిటలాడనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీలు పెద్దఎత్తున ఏర్పాట్లు చేపట్టాయి. ఆలయాలకు విద్యుద్దీపాలంకరణలు చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. రోజంతా ఉపవాస దీక్ష చేసి, రాత్రికి భక్తులు జాగరణ చేయనున్నారు. జాగరణ నిమిత్తం పెద్దఎత్తున భక్తులు ఆలయాలకు చేరుకోనుండడంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేపట్టారు. మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన దుర్గావీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. ఆలయంలో హోమాలు, అభిషేకాలు చేశారు. ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఆదిదంపతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

బహిరంగ వేలము ప్రకటన

సంయుక్త కలెక్టరు వారి కార్యాలయము, శ్రీ సత్యసాయి జిల్లా. తేది:08.12.2023.

శ్రీయుత జిల్లా సంయుక్త కలెక్టరు, శ్రీసత్యసాయి జిల్లా వారి ఉత్తర్వుల నెం. RC.No. K8/33/2024 తేది. 06.03.2024 మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం జప్తు చేయబడి ఈ క్రింద తెలుపబడిన 07 మండల స్థాయి గోదాముల నందు నిల్వ ఉంచిన బియ్యమును వేలము వేయుటకు నిర్దేశించడమైనది.

వేలం వేయబడిన బియ్యం (Raw Rice) నిల్వ ఉన్నమండల స్టాక్ పాయింట్లు

క్రమ సం	మండల స్థాయి గోదాము పేరు	వేలం నిర్వహించబడును సరుకు మొత్తం (క్వింటాళ్లలో)	బహిరంగ వేలము నిర్వహించు ప్రదేశము తేది మరియు సమయం	దరఖాస్తు రుసుము మరియు ధరావత్తు	దరఖాస్తు పొందు ఆఖరు తేది, సమయం మరియు ప్రదేశం (డిస్ట్రిక్ట్ సప్లై ఆఫీసర్ ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్, శ్రీ సత్యసాయి జిల్లా.)	దరఖాస్తు సమర్పించు చివరి తేది మరియు సమయం
1	ధర్మవరం	678.69	కోర్ట్ హాల్ కలెక్టరు కార్యాలయము, శ్రీ సత్యసాయి జిల్లా మార్చి 14వ తేది మధ్యాహ్నం 3.00 గంటలకు	రూ.3000/- మరియు రూ. 2,00,000/-	బహిరంగ వేలము ప్రకటన ఇచ్చినప్పటి నుండి మార్చి 14 వ తేది ఉదయం 11 గంటల (కార్యాలయ పని వేళలు మరియు పని దినాలలో)	మార్చి 14వ తేది మధ్యాహ్నం 12 గంటల వరకు
2	ముదిగుబ్బ	402.80				
3.	చెన్నేకొత్తపల్లి	137.75				
4	పెనుకొండ	88.22				
5	హిందూపూర్	12				
6	కదిరి	231.10				
7	మడకశిర	12				
	మొత్తము	1562.46				

నిబంధనలు:

1. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు, వేలంలో బియ్యం కొనుగోలు చేయుటకు నిర్ణయించుకున్న ధరను దరఖాస్తునందు తప్పనిసరిగా పొందుపరచవలెను.

2. బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు District Civil Supply Officer, Sri Sathyasai District వారి పేరు మీద చెల్లుబాటు అగునట్లు డి.డి.2,00,000/- తీయవలెను.

3. కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంటు వారి లైసెన్స్ ఉన్న ట్రేడర్/రైస్ మిల్లర్ అయి ఉండవలెను.

4. వేలము ముగిసిన అనంతరం అర్హత పొందని వారికి వేలం కోసం చెల్లించిన ధరావతు పైకమునకు సంబంధించిన రసీదు తీసుకొని డి.డి.తిరిగి ఇవ్వబడును.

5. బహిరంగ వేలంలో ఎక్కువ పాట పాడి అర్హత పొందిన వారు వేలం ముగిసిన 5 దినములలో మొత్తం పైకం చెల్లించి, పైకం చెల్లించిన 15 దినములలో సరుకును స్వీకరించి సరుకులోని 30 దినములలో ఉపయోగించుకోవలెను.

6. వేలం పాటలో అర్హత పొంది నిర్ణీత సమయంలో మిగిలిన పైకమును చెల్లించని యెడల ధరావతుగా చెల్లించిన సొమ్ము (డి.డి) తిరిగి ఇవ్వబడదు.

7. వేలం ద్వారా పొందిన బియ్యాన్ని మళ్లించడం లేదా స్టాకును దుర్వినియోగం చేయడాన్ని నిరోధించుటకు బియ్యం యొక్క కార్యక ముగింపు వరకు స్టాకు ఉపయోగమును మరియు కదలికల విధానాన్ని రెవిన్యూ/ పౌరసరఫరాలు/ విజిలెన్సు మరియు ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గమనిస్తూ ఉంటారు.

8. వేలము వేయు సరుకును కార్యాలయ పనిదినములలో వేలము జరుపుటకు ముందు రోజులలోపు, దానిని నిల్వ ఉంచిన ప్రదేశము అనగా, పై పట్టికలో కనపరచిన మండల స్థాయి గోదాముల నందు పరిశీలించుకొనుటకు అనుమతించబడును.


9. బహిరంగ వేలంలో ఎక్కువ వేలం పాడిన ట్రేడర్/ రైస్ మిల్లర్ వారు రవాణా మరియు హమాలి ఖర్చులను భరించి పై విధముగా వారిగా మండల స్టాక్ పాయింట్ల నుండి బియ్యం తీసుకొనవలెను.

10. ఈ బహిరంగ వేలం అనేది జిల్లా సంయుక్త కలెక్టరు వారి తుది నిర్ణయానికి లోబడి ఉండును.

(for further information and application format visit http://srisathyasai.ap.gov.in/ notice category/ announcements

సంయుక్త కలెక్టరు వారి తరుపున / శ్రీసత్యసాయి జిల్లా

పుణ్యభూమి అనంత



సూపర్ సిక్స్ పథకాల బ్యాగును మడకశిరఅభ్యర్థి సునీల్‌కుమార్‌కు అందజేస్తున్న లోకేశ్

హిందూపురంలో యువతతో కరచాలనం

మడకశిర సభకు హాజరైన జనం

లోకేశ్ అభివాదం

విజయ సంకేతం చూపుతున్న మహిళ

చంద్రబాబు, లోకేశ్ ఉన్న జెండాతో యువత సందడి

హిందూపురం, మార్చి 7: అనంత జిల్లా పుణ్యభూమి అనీ, ఇక్కడ ఎవరైనా తప్పు చేస్తే పాతరేస్తారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రసిద్ధిచెందిన లేపాక్షి ఆలయం, తిమమ్మ మర్రిమాను ఉన్నాయన్నారు. సత్యసాయిబాబా నడయాడిన నేల అన్నారు. ఇక్కడికి రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. శంఖారావం యాత్రలో భాగంగా ఆయన గురువారం జిల్లాలో పర్యటించారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన సభల్లో పాల్గొన్నారు. హిందూపురం పట్టణ పరిధిలోని కొట్నూరు ఇందిరమ్మ కాలనీ వద్ద శంఖారావం సభలో నారా లోకేశ్ ప్రసంగిస్తూ.. టీడీపీ అంటే గుర్తుకొచ్చేది హిందూపురమేననీ, ఇక్కడి ప్రజలు తమ కుటుంబాన్ని ఆదరిస్తున్నారన్నారు. వారి రుణం ఎలా తీర్చుకోవాలని ఆలోచిస్తున్నామన్నారు. ఎన్టీఆర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పంపిన ఘనత హిందూపురానికే దక్కుతుందన్నారు. మామయ్యలు హరికృష్ణ, బాలకృష్ణను నాలుగుసార్లు శాసనసభకు పంపారన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పైపులైను ద్వారా పట్టణానికి నీళ్లిచ్చిన ఘనత మామయ్య బాలకృష్ణదేనన్నారు. సీసీ రోడ్లు, ఆసుపత్రిలో మాతాశిశు కేంద్రం నిర్మాణం, పాడిపరిశ్రమలను ప్రోత్సహించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కొవిడ్ సమయంలో సొంత నిధులతో వెంటిలేటర్లు, మందులను పంపిణీ చేశారన్నారు. అన్న క్యాంటీన్ ద్వారా ఉచితంగా భోజనం, ఆరోగ్య రథం, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పరీక్షలు, సంచార వైద్యం అందించారన్నారు. ఆఖరుకు బ్రాహ్మణి దగ్గర నుంచి పీఎఫ్ఆర్ ఫండ్స్ మొత్తం హిందూపురానికే ఖర్చు పెట్టించారన్నారు. భారీ మెజార్టీతో బాలయ్య మామను గెలిపించి, మూడోసారి అసెంబ్లీకి పంపాలని నియోజకవర్గ ప్రజలను కోరారు.

టీడీపీ హయాంలో జీడిపల్లి, పేరూరు ప్రాజెక్టులు ప్రారంభిస్తే జగన్‌రెడ్డి వాటికే మళ్లీ శిలాఫలకాలు ఏర్పాటు చేశారన్నారు. ఎక్కడ చూసినా శిలాఫలకాలు దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నాయన్నారు. వైసీపీ హామీ ఇచ్చిన జిల్లా కేంద్రం ఏర్పాటు, వైద్య కళాశాల ఎక్కడికెళ్లాయని ప్రశ్నించారు. వైసీపీ హిందూపురం నియోజకవర్గ నేతలు అక్రమ మద్యం వ్యాపారం, ఇసుకతో లూటీ చేస్తున్నారన్నారు. హిందూపురం నియోజకవర్గానికి ఏడాదికి ఒకరు చొప్పున వైసీపీ ఇన్‌చార్జిలు మారారన్నారు. ఇప్పుడున్న ఇన్‌చార్జి నంబర్ ఎంతో తెలీదంటూ ఎద్దేవా చేశారు.

మడకశిరను అభివృద్ధి చేశాం

మడకశిర: మారుమూల మడకశిర నియోజకవర్గాన్ని టీడీపీ హయాంలో ఎంతో అభివృద్ధి చేశామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని చీపులేటి వద్ద ఏర్పాటు చేసిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై వేలకోట్ల రూపాయలు వెచ్చించామన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న నాయకత్వంలో మడకశిర ప్రాంతంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేశామన్నారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేశామనీ, మూడు గురుకుల పాఠశాలలు నిర్మించామనీ, ఏకంగా ఇండోర్ స్టేడియం కట్టిన ఘనత తెలుగుదేశం పార్టీదే అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం నిధులు కేటాయిస్తే.. వైసీపీ ప్రభుత్వం ఆ పనులను కూడా నిలిపి వేసిందన్నారు. వైసీపీ ఎమ్మెల్యే తిప్పేస్వామి అవినీతి గురించి చెప్పాలంటే రోజు మొత్తం సరిపోదన్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు భూములు కొని, అధికా ధరకు విక్రయించి, సొమ్ము చేసుకున్నారన్నారు. అంగన్‌వాడీ పోస్టులు కూడా అమ్ముకున్నారని ఆరోపించారు. ఇసుక కూడా దోచుకున్నారన్నారు. రోడ్లు వేయాలంటే ఎమ్మెల్యేకు కప్పం కట్టాల్సిన పరిస్థితి ఉందనీ, క్వారీలను కూడా వదిలిపెట్టడం లేదన్నారు. అవినీతి ఫుల్ అభివృద్ధి నిల్... అన్నట్లు సాగుతోందన్నారు. ఎమ్మెల్యేకు వసూల్ రాజా అని పేరు పెడదామన్నారు. నియోజకవర్గానికి పాదయాత్రలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను గాలికొదిలేశారన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే నియోజకవర్గంలో వక్క మార్కెట్ ఏర్పాటు చేసే బాధ్యత తీసుకొంటానన్నారు. పిల్లకాలువల ద్వారా సాగునీరు అందిస్తామనీ, పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత తానే తీసుకొంటానని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న గురుకుల పాఠశాలలు, ప్రాజెక్టులను పూర్తి చేస్తామనీ, పట్టురైతులకు సబ్సిడీ పునరుద్ధరిస్తామన్నారు. భారీ మెజార్టీతో సునీల్‌కుమార్‌ను గెలిపించి, అసెంబ్లీకి పంపింపాలని నాయకులు, కార్యకర్తలను కోరారు.

శంఖారావం సభల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, జనసేన నేత టీసీ వరుణ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి సునీల్‌కుమార్, పెనుకొండ అభ్యర్థి సవిత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజినప్ప, పెద్దఎత్తున టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరిన్ని పరిశ్రమలు తీసుకొస్తాం

పెనుకొండ టౌన్: టీడీపీ అధికారంలోకి రాగానే పెనుకొండ ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలు తీసుకొస్తామని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. పట్టణ పరిధిలో గురువారం నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ.. మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి, నిరుద్యోగ సమస్యను రూపుమాపుతామన్నారు. పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అధికార పార్టీకి చెందిన పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ అవినీతి అనకొండ అని లోకేశ్ ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే అన్నదమ్ములు నియోజకవర్గాన్ని కేక్‌లా కట్‌చేసి, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కియ అనుబంధ సంస్థల యాజమాన్యాలను బెదిరించి, మామూళ్లు అడగడంతో వెనక్కి వెళ్లాయన్నారు. లేబర్ కాంట్రాక్టు తీసుకుని, సకాలంలో జీతాలు కూడా చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. లేఔట్ వేయాలన్నా, సెంటు భూమికి పట్టా కావాలన్నా కమీషన్ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అక్రమాలు హెచ్చుమీరడంతో ఈ అనకొండను పక్క నియోజకవర్గానికి తరిమారన్నారు. మరో అనకొండ పెనుకొండకు వైసీపీ సమన్వయకర్తగా వచ్చారన్నారు. చెత్త ఎక్కడ వేసినా చెత్తేకదా అంటూ ఎద్దేవా చేశారు. టీడీపీ హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. కియ, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. అభివృద్ధి కావాలంటే నియోజకవర్గ ప్రజలు టీడీపీని ఆదరించాలని ఆయన కోరారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సవితను గెలిపించి, శాసనసభకు పంపాలని నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు.

రాబోయే ఎన్నికలు యుద్ధం లాంటివి



రాబోయే ఎన్నికలు యుద్ధం లాంటివి. కార్యకర్తలు సర్వశక్తులు వడ్డాల్సిన అవసరం ఉంది. చంద్రబాబును సీఎం చేసుకునేందుకు కార్యకర్తలంతా సిద్ధంకావాలి. రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించడానికి సైనికుల్లా ముందుకెళ్లాలి. కరువుతో అల్లాడుతున్న జిల్లాకు తాగు, సాగునీరు అందించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించాం. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనం చేశారు. ఎమ్మెల్యే శంకర్‌నారాయణ నాపై, కార్యకర్తలపై ఎన్నో తప్పుడు కేసులు పెట్టి, వేధించాడు. కనీసం 5 కిలోమీటర్లు కూడా రోడ్డు వేయలేకపోయారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. పార్టీని ఆదరించాలి. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

- బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

నీరు రావాలన్నా... ఉద్యోగాలు రావాలన్నా.. చంద్రబాబు సీఎం కావాలి



రాబోయే ఎన్నికల నీతికి, అవినీతికి మధ్య సాగే యుద్ధం. టీడీపీ హయాంలో రూ.1350 కోట్లతో మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. మడకశిరకు నీరు రావాలన్నా.. ఇక్కడి యువతకు ఉద్యోగాలు కావాలన్నా చంద్రబాబునాయుడు సీఎం కావాలి. ఈ ప్రాంతం నుంచి చాలామంది కియ పరిశ్రమలో పనిచేస్తున్నారు. వారికి ఉపాధి కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. ఆయనకు మడకశిర నియోజకవర్గం తరఫున కృతజ్ఞతలు. అలాంటి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. మడకశిరలో 30 వేల ఓట్ల మెజార్టీతో గెలిచి ఆయనకు కానుకగా అందిద్దాం.

- టీడీపీ-జనసేన ఉమ్మడి మడకశిర అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

వైసీపీ అరాచకాలకు అదరం.. బెదరం



వైసీపీ అరాచకాలపై ఐదేళ్లుగా పోరాడుతున్నాం. అధికారులను అడ్డుపెట్టుకుని మాపై అక్రమ కేసులు పెట్టినా అదరం.. బెదరం. టీడీపీ జెండా పట్టుకునే ఉంటాం. కియ కార్ల పరిశ్రమ యాజమాన్యాన్ని బెదిరించడం మొదలు అనుబంధ పరిశ్రమలను భయభ్రాంతులకు లోను చేసి, దోచుకోవడానికి, దాచుకోవడానికే వైసీపీ వలస పక్షులు వచ్చాయి. ఓ వలస పక్షి ఎమ్మెల్యే శంకర్‌నారాయణ వచ్చి దోచుకెళ్లాడు. ఇప్పుడు మరో వలసపక్షి కళ్యాణదుర్గంలో డిపాజిట్లు రావని ఇక్కడికి వచ్చింది. అధికారులను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు దిగుతోంది. ఈమెకూడా దోచుకోవడం తప్ప.. ఏ కాసింత అభివృద్ధి కూడా చేయదు. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించి, నీరిచ్చి, కియ పరిశ్రమను ఏర్పాటు చేయించిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుంది. రాబోయేది టీడీపీ ప్రభుత్వమే. పెనుకొండ రూపురేఖలు మారుస్తాం. భారీ మెజార్టీతో పెనుకొండను గెలిచి, చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తాం.

- టీడీపీ-జనసేన ఉమ్మడి పెనుకొండ అభ్యర్థి సవిత

శంఖారావం ఏర్పాట్ల పరిశీలన



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న పల్లె

కొత్తచెరువు, మార్చి 7: మండల కేంద్రంలోని ధర్మవరం రోడ్డులో శంఖారావం సభా వేదిక ఏర్పాట్లను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గురువారం పరిశీలించారు. బహిరంగసభకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లను ఆయన దగ్గరుండి పూర్తి చేయించారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. వచ్చే వారికి భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పల్లె వెంట నాయకులు రామాంజనేయులు, సోమశేఖర్, ఒలిపిశీన, సాలక్కగారిశ్రీనివాసులు, సయ్యద్, మనోహర్, ఊరువాకిలి సురేశ్‌నాయుడు, హరి, ఎల్ఐసీ నరసింహులు ఉన్నారు.

శంఖారావం సభకు తరలిరండి: కందికుంట

కదిరి, మార్చి 7: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శుక్రవారం చేపట్టిన శంఖారావం సభకు కదిరి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులందరూ తరలిరావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ గురువారం ప్రకటనలో పిలుపునిచ్చారు. పట్టణంలోని మదనపల్లిరోడ్డులో గల దేవరపల్లి సమీపం.. కొత్త బైపాస్ రోడ్డు వద్ద ఉదయం 11గంటలకు శంఖారావం సభ జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు.

విజయవంతం చేయండి

పుట్టపర్తి రూరల్, మార్చి 7: టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేశ్ చేపట్టిన శంఖారావం సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పిలుపు నిచ్చారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తచెరువులోని ధర్మవరం రోడ్డులో ఈ శంఖారావం సభ జరగనుందన్నారు. నియోజకవర్గం లోని తెలుగుదేశం, జనసేన పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ పరీక్షకు 326 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 7: జిల్లావ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గురువారం ద్వితీయ సంవత్సరం సివిక్స్-2, బోటనీ-2, గణితం-2ఏ పరీక్షలు జరిగాయని ఆర్ఐఓ సురేశ్‌బాబు తెలిపారు. 41 కేంద్రాలలో 9,432 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 326 మంది గైర్హాజరయ్యారన్నారు. 9106 మంది పరీక్షలు రాశారని ఆయన చెప్పారు.

చేయూత నిధులు విడుదల

పుట్టపర్తి, మార్చి 7: చేయూత కింద జిల్లాలో 1,12,482మంది లబ్ధిదారులకు రూ.210కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం ఇందుకు సంబంధించిన మెగా చెక్కును ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల ఖాతాల్లో నిధులు జమచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, ఎంపీపీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి బాటలు వేసింది చంద్రబాబే

భవిష్యత్తు గ్యారెంటీలో పరిటాల జ్ఞాన



23వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న పరిటాల జ్ఞాన తదితరులు

ధర్మవరం, మార్చి 7: మహిళల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ సతీమణి పరిటాల జ్ఞాన పేర్కొన్నారు. పట్టణంలోని 23వ వార్డులో గురువారం ఆమె బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతింటికీ వెళ్లి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చి మహిళల అభ్యున్నతికి బాటలు వేసింది చంద్రబాబేనన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలంటే టీడీపీనే సాధ్యమన్నారు. కనుక వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ధర్మవరం నియోజకవర్గంలో పరిటాల శ్రీరామ్ అన్ని వర్గాల ప్రజలకు చేరవయ్యారని, ఆయన ఇక్కడ ఎమ్మెల్యే కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, అడ్రామహేశ్, నాగూర్‌హుస్సేన్, వెంకటేశ్, పురుషోత్తంగౌడ్, కేశగాళ్లశీన, రాంపురంశీన, గంగారపురవి, గడ్డంకుళ్లాయప్ప, కత్తులబాబ్జీ, చీమలనాగరాజు, అంకేదుర్గేశ్, తోట నారాయణస్వామి, అశోక్, బత్తలగంగాధర్, ముతుకూరుబీబీ, మాదనమహేశ్వరి, కత్తులసునీత, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

25వ వార్డులో ముమ్మర ప్రచారం

కదిరి, మార్చి 7: పట్టణంలోని 25 వార్డులో గురువారం కందికుంట వెంకట ప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ ముమ్మర ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి సీఎంగా చంద్రబాబును, ఎమ్మెల్యేగా కందికంట వెంకటప్రసాద్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. ప్రతి ఇంటివద్ద ఆమెకు ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో నాయకులు పర్వీనాబాను, డైమండ్ ఇర్షాన్, ఖాదర్‌బాషా, ఇదాయత్, కౌన్సిలర్ అల్తాముస్తఫా, బాబున్ను, మున్నా, అయూబ్, కతాబ్, ఇలియాజ్, దాదాపీర్, ఏజేను, అల్మాం, సలాం, ఇస్మాయిల్, ఫారూక్, నాసిర్ అలీ, అతిక్, మన్సూర్, పవన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక మండే ఎండలు

బుక్కరాయసముద్రం, మార్చి 7: ఉమ్మడి జిల్లాలో రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి గురువారం తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39.7 నుంచి 40.7 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.9 - 24.7 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆగ్నేయం దిశగా గాలులు గంటలకు 3 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని అన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు నేల పరిస్థితుల ఆధారంగా తరచూ పంటలకు నీటి తడులు ఇవ్వాలని సూచించారు. వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించడానికి మొక్కజొన్న జొన్న, ఇతర పప్పు పంటల నుంచి సైలేజ్‌ను తయారు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెస్సీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 7: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెస్సీ పరీక్షల ఫలితాలను విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఫిబ్రవరిలో ఎమ్మెస్సీ ప్రథమ, తృతీయ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని విద్యార్థులకు సూచించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి, మార్చి 7 : పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయి కుల్వంత్ హాల్లో భక్తులు చేపట్టిన సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గురువారం సాయంత్రం ప్రశాంతి డ్యాన్స్‌గ్రూపు సత్యం.. శివం.. సుందరం పేరిట సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా శుక్రవారం అఖండ భజన నిర్వహించనున్నారు.

కన్నీటి కడలి..!



ప్రమాదస్థలంలో రోదిస్తున్న బంధువులు, రమీజా (ఫైల్)

తాడిమర్రి, మార్చి 7: ఇది కన్నీళ్లకే కన్నీళ్లు తెప్పించే ఓ ఇంటి కథ. కన్నీటి కడలిని తలపించే కష్టాల ప్రయాణం. ఏళ్ల క్రితమే ఇంటి పెద్దదిక్కు రోడ్డు ప్రమాదంలో గాయపడి, పనిచేయలేని స్థితిలో ఉన్నాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుక్కి బుద్ధిమాంద్యం. కూలికెళ్లి ఆ ఇల్లాలు.. భర్త, కుమారుడిని పోషించుకుంటోంది. ఈ కష్టాలు చాలవన్నట్లు 9 రోజుల క్రితమే కూతురి భర్త విద్యుదాఘాతంతో మరణించాడు. దీంతో కుమార్తె బాధ్యత ఆ ఇల్లాలిపై పడింది. చివరగా.. ఆ ఇంటికి ఆధారమైన ఆమె కూడా ప్రాణాలు కోల్పోయింది. భర్త, కుమారుడు, కుమార్తె రోడ్డునపడ్డారు. మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన పి.రమీజా(45) దుస్థితి ఇది. రమీజా భర్త ఫక్రుద్దీన్ గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి పనులకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాడు. 26 ఏళ్ల వయసుగల కుమారుడు బాషా బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నాడు. ఇద్దరు కుమార్తెలు ఉండగా.. వారికి వివాహాలు అయ్యాయి. కాగా పెద్ద కుమార్తె వన్నూరమ్మ భర్త 9 రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దీంతో కుటుంబ భారమంతా రమీజాపై పడింది. పొలం పనులు చేస్తూ వచ్చిన కూలి డబ్బుతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న ఆమెను కూడా మృత్యువు వెంటాడింది. రమీజా గురువారం అదే గ్రామానికి చెందిన కూలీలతో కలిసి వేరుశనగ కట్టెను మిషన్‌లో ఆడించేందుకు వెళ్లింది. పెద్దకోట్ల గ్రామం వద్ద వేరుశనగ కట్టెను ఆడించారు. మధ్యాహ్నం భోజనం కోసం మిషన్‌ను ఆఫ్ చేసి, ఆ తరువాత ప్రారంభించారు. ఆ సమయంలో రమీజా తన బ్యాగును ఇంజన్ వద్ద ఉంచేందుకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు చీర కొంగు.. మిషన్ రాడ్డుకు తగులుకుంది. రాడ్డుకు ఎలాంటి పరికరం అడ్డుగా లేకపోవడంతో రమీజాను లాగేసింది. దీంతో ఆమె మెడ భాగం నుజ్జునుజ్జయి, చూడటానికి వీలులేకుండా మారింది. మిషన్ యజమాని వెంటనే మిషన్ ఆఫ్ చేశాడు. అప్పటికే ఆమె మృతిచెందింది. తాడిమర్రి పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. అల్లుడు చనిపోయి 9 రోజులు తిరక్కుండానే.. రమీజా మృతిచెందడంతో ఆ ఇంట్లో విషాదం అలుముకుంది. అనారోగ్యంతో ఉన్న భర్త, బుద్ధిమాంద్యం కుమారుడు, భర్తను పోగొట్టుకున్న కుమార్తె, ఆమె పిల్లలు దిక్కులేనివారయ్యారు. వరుస ఘటనలతో వారి కుటుంబం ఛిద్రమైంది. ఆ పేద కుటుంబానికి దేవుడు ఎందుకింత తిప్పలు పెడుతున్నాడోనని స్థానికులే కన్నీటి పర్యంతమయ్యారు.

నర్సింగ్ విద్యార్థులకు జపాన్‌లో ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి రూరల్, మార్చి 7: జిల్లాలో నర్సింగ్ విద్యార్థులకు జపాన్‌లో నర్సులుగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్‌ఖయ్యూమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జపాన్ దేశంలో నర్సింగ్ ఉద్యోగావకాశాలకు సంబంధించి శిక్షణ కాలం ఆరునెలలు ఉందన్నారు. ఈ శిక్షణ బెంగుళూరులో నిర్వహిస్తున్నారన్నారు. శిక్షణ ఫీజు రూ. 3,50,000లని తెలిపారు. పాక్షిక రుసుం రూ. 50వేలు కాగా .. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ. 25వేలు చెల్లిస్తుందని, మిగిలిన రూ. 25వేలు అభ్యర్థి చెల్లించాలని చెప్పారు. మిగిలిన రూ. 3లక్షలు విడతలవారీగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగం పొందిన అభ్యర్థికి జీతభత్యాలు రూ.లక్షా పదివేల నుంచి రూ. లక్షానలభై వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు 9398643930కు సంప్రదించాలన్నారు. www.apssdc.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

● జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

పుట్టపర్తి, మార్చి 7: ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కలిగించడం జరిగిందని, సద్వినియోగం చేసుకోవాలంటూ జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆయన అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు ఎన్నికలు సజావుగా సాగేందుకు అధికారులు సంసిద్ధం కావాలన్నారు. అంతకు ముందు జేసీ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివసాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు సామగ్రి పరిశీలన

పుట్టపర్తి రూరల్, మార్చి 7

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బందోబస్తుకు పోలీసు సిబ్బంది ఉపయోగించే సామగ్రిని ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసుకార్యాలయంలో గురువారం ఆయన హెల్మెట్‌స్టోన్ గార్డు, లాఠీలు, మెగాఫోన్, లైట్ బాడీ ప్రొటెక్టర్, వంటి సామగ్రిని పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తినప్పుడు పోలీసులు వాటిని ఏవిధంగా ఉపయోగించాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్ఐలు రవికుమార్, వలి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నల్లచెరువు, మార్చి 7: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని మండలకేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ గంగరత్నమ్మ, సూపర్‌వైజర్ రఫీమున్నీసాతో పాటు నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట మండలాల మహిళలు పాల్గొన్నారు. తొలుత వారు ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటు చేశారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



నల్లచెరువులో మానవహారంగా ఏర్పడిన మహిళలు

కదిరిఅర్బన్: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా వైద్యులను, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ హుస్సేన్‌బాషా, ఎన్జీవో నాయకులు ఆత్మారెడ్డి, రామచంద్రారెడ్డి, దేవలనాయక్, వలసలాదేవి, హరిప్రసాద్, గోపీనాయక్, నాగమణి, ఉపాధ్యాయురాళ్లు క్రిష్ణవేణి, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతమొందిద్దాం

- భవిష్యత్తు గ్యారెంటీలో టీడీపీ నాయకుల పిలుపు

ధర్మవరం, మార్చి 7: రాష్ట్రంలో కొనసాగుతున్న వైసీపీ అరాచక పాలనను వచ్చే ఎన్నికల్లో అంతమొందిద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని 14వ వార్డులో గురువారం వారు పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ పథకాలన్నీ అమలవుతాయన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. గత నాలుగున్నరేళ్లకు పైగా వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ పాలనను తరమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగేశు, భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, చింతపులుసు పెఓద్దన్న, అంబటిసనత్, రాళ్లపల్లిషరీఫ్, గుడిపాటి కిశోర్, కరెంటు ఆది, గోసలశ్రీరాములు, అత్తార్ రహీంబాషా, బడిగింజల రమణ, గంగారపురవి, మాధనసుబ్బయ్య, రావులచెరువు కుళ్లాయప్ప, మాధవరెడ్డి, బీరే శీనా, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



14వ వార్డులో భవిష్యత్తు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ నాయకులు

'పోలీసు సోదాల వెనుక ఆంతర్యమేమిటో?'

ధర్మవరం, మార్చి 7: విజయవాడలో జనసేన పార్టీ కార్యాలయ సిబ్బంది బసచేసే అపార్ట్‌మెంట్‌పై పోలీసులు ఎటువంటి కారణాలు చెప్పకుండా సోదాలు చేయడంలో ఆంతర్యమేమిటని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనసేన పార్టీ కార్యాలయ సిబ్బందికి చెందిన అపార్ట్‌మెంట్‌పై బుధవారం రాత్రి పోలీసులు ఎవరి అనుమతిలేకుండా సోదాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. జనసేన, టీడీపీ పొత్తు ఖరారైనప్పటి నుంచి సీఎం జగన్‌కి ఓటమి భయం పట్టుకుందన్నారు. దిక్కుతోచని స్థితిలో ఈ విధమైన దుశ్చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. త్వరలోనే ప్రజలు జగన్‌కు తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు

ఓబుళదేవరచెరువు/ నల్లమాడ, మార్చి 7: ప్రైవేటు పాఠశాలలో పేద విద్యార్థులకు ఉచిత విద్యాహక్కు చట్టం ప్రకారం 25శాతం ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఓడీసీ, నల్లమాడ మండలాల విద్యాశాఖాధికారులు డీ.సురేష్‌బాబు, జే. రమణ, వేమనారాయణ, సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉచిత విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం అన్ని ప్రైవేటు పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 1వతరగతిలో 25శాతం ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అనాథలు, దివ్యాంగులు, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 1వతరగతిలో ఉచిత ప్రవేశం కొరకు ఈనెల 25వ తేదీలోగా cse.ap.gov.in వెబ్‌సైట్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామీణ విద్యార్థులు వార్షికాదాయం రూ.లక్షా20వేలు, పట్టణ విద్యార్థులకు రూ.లక్షా40వేలు మించకూడదన్నారు.

జనసేనలోకి పలువురి చేరిక

కొత్తచెరువు, మార్చి 7: మండలకేంద్రంలో గురువారం కాంగ్రెస్‌కు చెందిన గాజుల నాగేంద్రతో పాటు 20 మంది జనసేనలోకి చేరారు. వారు పుట్టపర్తి నియోజవర్గ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పత్తిచంద్రశేఖర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ పూల శివ, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో శిక్ష

నల్లమాడ, మార్చి 7: మండలంలోని పులగంపల్లి సమీపంలో 8-8-2013వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గడ్డం అంజనమ్మ మృతి చెందింది. అమడగూరు గ్రామానికి చెందిన వి. నరసింహమూర్తి ఆటోను అజాగ్రత్తగా నడుపుతూ పులగంపల్లి పూలబండవద్ద ఎదురుగా వస్తున్న అంజినమ్మను ఢీకొట్టాడు. దీనిపై అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆ కేసులో కదిరి కోర్టులో న్యాయాధికారి 15మంది సాక్షులను విచారించారని, నేరం రుజువైనందున గురువారం ముద్దాయికి ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.రెండువేలు జరిమానా విధించారని ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

నేటి నుంచి పెద్దమ్మ జాతర

ముదిగుబ్బ, మార్చి7: మండల కేంద్రంలోని పాతూరులో వెలసిన గ్రామదేవత పెద్దమ్మతల్లి జాతర శుక్రవారం మహాశివరాత్రి రోజున ఘనంగా ప్రారంభం కానుంది. మూడురోజుల పాటు జాతర అంగరంగ వైభవంగా జరగనుంది. మొదటిరోజు అమ్మవారి పల్లకీని అలంకరించి, అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రెండవరోజున గుండోళ్ల బావి వద్ద వెలసిన నల్లమ్మ గద్దె మీద అమ్మవారి పల్లకిని ఉంచి జాతర జరిపిస్తారు. మూడో రోజు పాతఊరిలోని పెద్దమ్మ ఆలయ ఆవరణంలో జాతర జరుపుతారు. ప్రతి ఇంటిలోనూ జాతరను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. మొక్కుబడులు ఉన్న వారు పొంగళ్లు, జంతుబలులు సమర్పిస్తారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

నంబులపూలకుంట, మార్చి 7: మహాశివరాత్రి ఉత్సవాలు మండలంలోని గూటిబైలు గ్రామంలోగల తిమ్మమ్మ మర్రిమాను వద్ద గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రథోత్సవంతో ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి మేళతాళాలతో అర్చకులు ఊరేగింపుగా తెచ్చి రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభించారు. తిమ్మమ్మ రథోత్సవం ఎగువ, దిగువ గూటిబైలు గ్రామాల్లో పురవీధుల గుండా సాగింది. పలువురు భక్తులు అమ్మవారికి చీర, సార సమర్పించి మొక్కులు చెల్లించారు. అంతకుమునుపు ఆలయంలోని తిమ్మమాంబ మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. శుక్రవారం మహాశివరాత్రి జాగరణకు వేలాదిమంది భక్తులు తరలిరానున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



ప్రత్యేకాలంకరణలో తిమ్మమాంబ అమ్మవారు

ఓటుహక్కుపై యువతకు అవగాహన

కొత్తచెరువు, మార్చి 7: ఓటు విలువను ప్రతి యువతీ యువకులు తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంయుక్తకార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని శివసాయి డిగ్రీ కళాశాలలో గురువారం సిటిజన్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకో అనే అంశంపై యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజకీయం కలుషితమైందన్నా రు. రాజకీయాల్లోకి గూండాలు, హంతకులు, భూస్వాములు, డబ్బుఉన్న వారు వస్తున్నారన్నారు. వారు తమ తమ ఆస్తులను కాపాడుకోవడానికి, కేసుల నుంచి బయటపడేందుకే తమ అధికారాన్ని వినియోగించుకుంటున్నారని, ప్రజలను పట్టించుకోవడం లేదని వాపోయారు. కనుక నేటి యువత ఓటు హక్కును వినియోగించుకుని సమాజ అభివృద్ధికి దోహదపడేవారిని ఎన్నుకోవాలని తెలిపారు. అనంతరం ఓటుహక్కుపై కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. కళాశాల కరెస్పాండెంట్ శేషప్ప, ప్రిన్సిపాల్ జాకీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

దక్షిణ కాశీగా హెంజేరు సిద్దేశ్వరాలయం

- విగ్రహరూపంలో వెలసిన శివుడు
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


హెంజేరు సిద్దేశ్వరస్వామి

మడకశిర టౌన్, మార్చి5: అమరాపురం మండలం హేమావతిలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయం దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందింది. భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా స్వామి వెలుగొందుతున్నారు. అమరాపురం మండల కేంద్రానికి 11 కిలోమీటర్ల దూరంలో హేమావతి హెంజేరు సిద్ధేశ్వరాలయం ఉంది. పవిత్ర పుణ్యక్షేత్రంగా పేరొందిన ఈ ఆలయంలో స్వామి విగ్రహరూపంలో దర్శనమిస్తున్నాడు. అలాగే రుండ మాలధరుడిగా ఉండడం విశేషం. సూర్యాస్తమయం సమయంలో స్వామి నుదుటిపై సూర్యుడి కాంతి పడి ఆలయంలో వెలుగులు విరజిల్లడం ఇక్కడి ప్రత్యేకత. ఈ ఆలయాన్ని చోళరాజుల పాలనలో నిర్మించినట్లు ఇక్కడి శాసనాల ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఈ ప్రాంతాన్ని ఏలిన నొళమాంబ రాజుల పాలనలో ఆ గ్రామాన్ని హెంజేరుగా పిలిచేవారు. నిడగల్, రత్నగిరి సంస్థానాలకు ముఖ్యపట్టణంగా ఉన్న ఈ గ్రామంలో సాంస్కృతిక విశ్వ విద్యాలయం నెలకొల్పినట్లు తెలుస్తోంది. సామంత రాజుల పాలనలో సీతాదేవి అనే మహారాణి ఒక రోజు ఇంట్లో వంటలు చేస్తుండగా వచ్చేపొగ బంగారు రంగులో కనబడడంతో హైమావతిగా ప్రసిద్ధికెక్కినట్టు స్థానిక కథనం తెలుపుతోంది. హైమ అనగా బంగారం, వతి అనగా మహిళ. రానురాను హైమావతి హేమావతిగా రూపాంతరం చెందినట్లు చెబుతున్నారు..

పంచలింగాలకు ప్రసిద్ధి : హేమావతి గ్రామంలో దొడ్డేశ్వర, మల్లేశ్వర, విరుపాక్షేశ్వర దేవాలయాలు హెంజేరు సిద్దేశ్వరాలయం ఆవరణంలో ఉన్నాయి. చిత్రేశ్వర, సోమేశ్వరాలయాలు బోయ వీధిలో ఉన్నాయి. ఆ రెండు ఆలయాలు సిద్దేశ్వరాలయం ఆవరణంలో లేకపోవడంతో నిరాదారణకు గురవుతున్నాయి. ఆధ్యాత్మికతకు, శిల్పకళకు ఈ దేవాలయాలు ప్రతీకగా నిలిచాయి. సిద్దేశ్వర, దొడ్డేశ్వరస్వామి దేవాలయాలు పడమర ముఖద్వారం కలిగి ఉండడం ఇక్కడి మరో ప్రత్యేకత. సిద్దేశ్వరాలయం సమీపంలో కళ్యాణి బావి, నవకోటమ్మ ఆలయాలున్నాయి. కల్యాణి బావిలో స్నానం చేస్తే దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయని భక్తుల విశ్వాసం.

ఆలయ విశిష్టత : దక్షిణభారతీయ వాస్తు, శిల్పపరంగా హేమావతి సిద్దేశ్వరాలయం విశిష్ట స్థానం పొందింది. దీనిని దక్షిణ కాశీగా పిలిచేవారు. ఇక్కడ శివుడు పీఠంపై ఆశీనుడైన 5.8 అడుగుల ఎత్తు విగ్రహంరూపంలో వెలిశాడు. ఆలయంలో నల్లనిరాతితో చేసిన శివలింగాలు, శివుడికి ఎదురుగా ఉన్న మండపంలో గంభీరంగా లేచి వస్తున్నట్లుగా చూపరులను ఆకట్టుకునే నందివిగ్రహాలను చూడవచ్చు. ఆలయం 14 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యానవనంతో ఎంతో ఆహ్లాదాన్నిస్తుంది. ఇప్పటికీ గ్రామ పరిసరాలలో ఎక్కడ తవ్వకాలు జరిపినా శివలింగాలు, ధ్వజస్తంభాలు, నంది విగ్రహాలు బయటపడుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. గర్భగుడులు చతురాస్రాకారంలో ఉండి అర్ధమండపం వాసరా ఉంటుంది. ఆలయాల గోడలపై వివిధ జీవుల ఆకృతులు చెక్కారు. స్తంభాలు, నంది విగ్రహా లు, శివలింగాలన్నిటినీ నల్లటి రాతితో చెక్కారు. ధ్వజస్తంభాలపై రామాయణ, మహా భారత ఘట్టాలను మలిచారు. ఆలయంలో గాలి, వెలు తురు వచ్చే విధంగా కిటికీలు, గవాక్షలు ఏర్పాటుచేశారు. కిటికీలలో గంగ, బ్రహ్మ, విష్ణు, కార్తికేయ, మిథున శిల్పాలు చూడవచ్చు. వాసరాలలో అష్టదిక్పాలకులను ప్రతిష్ఠించారు. నొళంబుల శిల్పకళ సౌందర్యానికి దొడ్డేశ్వరస్వామి ఆలయం ప్రతీకగా నిలిచింది.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతియేటా మహాశివరాత్రి పర్వదినంతో మొదలవుతాయి. ఆ మాదిరిగానే శుక్రవారం స్వామి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వాటి వివరాలను ఆలయ కమిటీ ఇలా తెలియజేశారు. స్వామికి శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, శనివారం స్వామికి బానుపల్లకి, పూజలు, భజనలు కీర్తనలు నిర్వహిస్తారు. అలాగే 10న అగ్నిగుండ మహోత్సవం వైభవంగా జరుగనుంది. 11న సిడిమాను ఉత్సవం, 12న చిన్నరథోత్సవం, 13న బ్రహ్మరథోత్సవం, 14న వసంతోత్సవం, 15న శయనోత్స వం నిర్వహిస్తారు. అగ్నిగుండ మహోత్సవానికి ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు.


హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం

శివరాత్రికి ఆలయాల ముస్తాబు


విద్యుత్ దీప కాంతుల వెలుగులో పురంలోని శ్రీకంఠేశ్వరాలయం

హిందూపురం అర్బన్, మార్చి 7: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హిందూపురంలో పలు ఆలయాల్లో శుక్రవారం ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు, వివిధ హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిం చనున్నారు. అదే విధంగా సాయంత్రం నుంచి యామ పూజలు చేపట్టనున్నారు. పురం ప్రాంతానికే తలమానికమైన బసవనపల్లి శివాలయం, అతి పురాతన కోట కాశీ విశ్వేశ్వరాలయం, సూరప్ప కట్ట వద్ద ఉన్న ప్రాచీన దక్షిణామూర్తి దేవాలయం, శ్రీకంఠేశ్వరాలయం, ఉమానర్మదేశ్వరాలయం, మేళాపురం శివాలయం, అనంత పద్మనాభస్వామి ఆలయం, నానెప్పనగర్ షిర్డీసాయి ఆలయం, రామమందిరం తదితర ఆలయాల్లో విశేషపూజలు నిర్వహించనున్నారు.

పెనుకొండ, మార్చి 7: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రసిద్ధిచెందిన కాశీవిశ్వేశ్వరాలయం, ఐముక్తేశ్వరాలయం, ఘనగిరి సోమేశ్వర, భోగలింగేశ్వర, శతకోటి లింగేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. అలాగే భోగసముద్రం చెరువులోని 40అడుగుల యోగముద్ర మహాశివుడి విగ్రహాన్ని, కాశీవిశ్వేశ్వరాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి అభిషేకాలు, యామపూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

ఆలయాల్లో పూజలు : స్థానిక భోగసముద్రం చెరువు వద్ద ప్రతియేడాదిలాగే భోగసముద్రం జలవనసంరక్షణ సమితి వారి ఆధ్వర్యంలో గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు శివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ సమితి సభ్యులు తెలిపారు. వేద బ్రహ్మ పంచాంగం నాగప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో గంగహారతి, హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, హోమాలు, రాత్రికి గిరిజా కల్యాణం, యామపూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



విద్యుత్ దీపాలంకరణలో పెనుకొండలోని ధ్యాన యోగేశ్వరుడు, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

ఘనంగా మహిళా దినోత్సవం


వీర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెనుకొండ, మార్చి 7 : స్థానిక శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ప్రసూన హాజరై ప్రసంగించారు. మహిళలపట్ల సమాజంలో వివక్ష ఇం కా పూర్తిగా పోలేదన్నారు. అందుకోసం అందరూ పోరాడాలని పిలుపుని చ్చారు. కేవలం 35శాతం ఆడవారు మాత్రమే ఉద్యోగాలు చేస్తున్నార న్నారు. మహిళా రిజర్వేషన్ 33శాతంపై పార్లమెంట్‌లో చట్టం చేసినా దాని అమలుకు కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ఈ సంవత్సరం మహిళ సమాన భాగస్వామ్యం పెంచుకోవాలని పిలుపుని చ్చారు. అనంతరం వీర అనే ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆదిశేషరెడ్డి, జేవీవీ జిల్లా కార్యదర్శి హరి, జోన్ కార్యదర్శి ఇమ్రాన్, గ్రంథాలయ అధికారిని భారతి, నాగమణి, ఏట కేశవ, విద్యార్థిని విద్యార్థులుపాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళా దినోత్సవంలో సీడీపీఓ పద్మావతి

గుడిబండ, మార్చి 7 : మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, అడ్వకేట్ లోకేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన గుడిబండలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళలతోనే అభివృద్ధికి సాధ్యమన్నారు. అనంతరం న్యాయవాది లోకేశ్ మాట్లాడుతూ మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయని అన్నారు. గృహహింస, బాల్య వివాహాలు, ఆస్తి హక్కు, తదితర చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ, మహిళా పోలీసు దేవీబాయి, వెలుగు కోఆర్డినేటర్ నాగరాజు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీఓ 117 రద్దును మేనిఫెస్టోలో చేర్చాలి

నారా లోకేశ్‌కు యూటీఎఫ్ నాయకుల వినతి

పెనుకొండ, మార్చి 7: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, జీఓ117 రద్దు చేస్తామని మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ తదితరులు గురువారం పెనుకొండకు వచ్చిన నారాలోకేశ్‌ను కలిసి వినతిని అందించారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ 117పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల విలీనం చేపట్టి ప్రాథమిక విద్యావ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందన్నారు. వేలాది పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోయాయన్నారు. ఉపాధ్యాయుల కొరతతో మంచి చదువులు అందక విద్యార్థులు అధోగతి పాలవుతున్నారన్నారు. జీఓ 117ను రద్దుచేసి ప్రభుత్వ విద్యారంగానికి పూర్వవైభవం తీసుకురావాలని ఆయనను కోరారు.

'నైపుణ్యాన్ని వెలికితీసేందుకే సైన్స్ ఫెయిర్'


వివిధ నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రొళ్ల, మార్చి 7: మండలంలోని మురళి ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో గురువారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పరికరాలను ప్రదర్శనకు ఉంచారు. విద్యార్థులు 125 రకాల నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ సన్నతిమ్మప్ప, పరిపాలన అధికారి యోగానంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు

రొద్దం, మార్చి 7 : విద్యహక్కుచట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉంటాయని, వాటి ప్రవేశానికి దరఖాస్తుల ను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ జయభాస్కర్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. నిబంధనలను అనుసరించి ప్రతి పాఠశాలలోనూ 2024-25 సంవత్సరానికి 1వ తరగతి చదవబోయే పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన వివరించారు.

సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణానికి నాంది


సర్వేనంబర్ 805లో ఇళ్ల నిర్మాణానికి నాందిరాళ్లు వేస్తున్న సీపీఎం నాయకులు

చిలమత్తూరు, మార్చి 7: పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని, దీంతో తామే స్వయంగా కొడికొండ చెక్‌పోస్టు సమీపంలోని సర్వే నంబర్ 805లో ఇంటి నిర్మాణాలకు నాందీ పలికినట్లు సీపీఎం నాయకులు పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ఆధ్వర్యంలో గురువారం నాయకులు ప్రవీణ్‌కుమార్, సుబ్బిరెడ్డి, పెద్దన్న, రమేష్, గంగాధర్, వెంకటేష్, లక్ష్మీనారాయణ తదితరలు కలిసి ఇంటి నిర్మాణాలకు నాందిరాయి వేశారు. అనంతరం అక్కడ ఏర్పటయ్యే కాలనీకి సుందరయ్య కాలనీగా నామకరణం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇంటి స్థలంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తామని వైసీపీ ప్రభుత్వం చెప్పిందని, అది ఎక్కడా జరగలేదన్నారు. నాలుగేళ్లుగా నిరుపేదలు ఇంటి స్థలం కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకపోయిందన్నారు. దీంతో సీపీఎం పేదలకు అండగా నిలబడి పోరాటం చేస్తోందన్నారు. హైకోర్టు ఉత్తర్వులు అమలుపర్చే విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గుడిసెలు వేసుకున్న చోటే శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధపడినట్లు పేర్కొన్నారు.


కాంట్రాక్టర్‌తో గొడవకు దిగిన డీటీ, రెవెన్యూ సిబ్బంది

బిల్లు చెల్లించకుండా దౌర్జన్యం

- భవనాన్ని స్వాధీనం చేసుకునేందుకు అధికారుల యత్నం
- అడ్డుకున్న కాంట్రాక్టర్.. రెవెన్యూ సిబ్బంది వాగ్వాదం
- హిందూపురంలో ఘటన
- తహసీల్దారు భవన నిర్మాణానికి బిల్లు బకాయి

హిందూపురం అర్బన్, మార్చి 7: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో నిర్మించిన నూతన భవనాన్ని అధికారులు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. బిల్లులు చెల్లించేదాకా భవనాన్ని అప్పగించేది లేదని కాంట్రాక్టర్ బాలాజీ అడ్డుకోవడంతో ఆయనతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది వాగ్వాదానికి దిగారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో హిందూపురం తహసీల్దారు కార్యాలయ భవ నిర్మాణానికి రూ.90 లక్షలతో టెండర్లు పిలిచారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ బాలాజీ, 2018లో పనులను ప్రారంభించారు. మొదటి దశలో రూ.30 లక్షలు బిల్లు చెల్లించారు. ఆ తరువాత నిర్మాణ పనులను కాంట్రాక్టర్ దాదాపు పూర్తి చేశారు. విద్యుత్, ఫర్నీచర్ వంటి చిన్న పనులు మాత్రమే మిగిలాయి. ఆ సమయంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో సమస్య మొదలైంది. మిగిలిన బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో బిల్లు వచ్చాక భవనాన్ని అప్పగిస్తానని కాంట్రాక్టర్ అధికారులకు చెప్పారు. వారు సరే అన్నారు. బిల్లు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రూ.68 లక్షలకు రెండేళ్ళ క్రితం బిల్లు చేశారు. సీఎఫ్‌ఎంఎస్ టోకెన్ నంబర్ రావడంతో బిల్లులు అప్‌లోడ్ చేశారు. కానీ నేటికీ మంజూరు కాలేదు. దీంతో భవనం కాంట్రాక్టరు అధీనంలోనే ఉండిపోయింది. ఈ నేపథ్యంలో బిల్లు ఇవ్వకపోయినా, భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులు గురువారం ప్రయత్నించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వరులు, ఆర్‌ఐ తదితరులు భవనం తాళాలను పగులగొట్టేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ బాలాజీ అక్కడికి వెళ్లి అడ్డుగా నిలిచారు. దీంతో ఆయనతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది వాగ్వాదానికి దిగారు. భవనంపై తమకు సర్వహక్కులు ఉన్నాయని, ఎన్నికల విధుల నిర్వహణకు స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. చివరకు దౌర్జన్యంగా తాళం పగులగొట్టారు. మునిసిపల్ కార్మికులతో భనాన్ని శుభ్రం చేయడానికి ప్రయత్నం చేశారు. అయినా కాంట్రాక్టర్ పట్టు విడువలేదు. బిల్లులు చెల్లిస్తేనే భవనాన్ని స్వాధీనపరుస్తానని చెబుతూ.. మరోమారు భవనానికి తాళం వేసుకున్నారు.


భవనానికి మరోమారు తాళం వేస్తున్న కాంట్రాక్టర్ బాలాజీ

వినికిడి లోపంపై అవగాహన

హిందూపురం అర్బన్, మార్చి 7: వినికిడి లోపం, చికిత్సా విధానాలపై స్థానిక జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం సూపరింటెండెంట్ రోహిల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వినికిడి లోపం ఉన్న చిన్నారులకు, వారి తల్లి తండ్రులకు అవగాహన కల్పించారు. రాష్ట్రీయ బాల ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా త్వరిత చికిత్సా కేంద్రంలో పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్న వారికి ఈ కార్యక్రమం నిర్వహించారు. డిజేబుల్ వెల్ఫేర్ ఏడీ అబ్దుల్ రసూల్ వినికిడి యంత్రాలను వితరణగా అందించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ రుక్మిణమ్మ, డీఈఐసీ మేనేజర్ రజిత, జిల్లా వైద్యాధికారి అపర్ణ, అయుడాలజిస్ట్ స్పీచ్ థెరపీ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ల నియామకం

గోరంట్ల, మార్చి 7: మండలంలోని గ్రామ సచివాలయాలకు తొమ్మిది మంది పశుసంవర్ధకశాఖ సహాయకులు నియమితులైనట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రెండురోజులుగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బాధ్యతలు చేపట్టిన వారి వివరాలను ఆయన గురువారం వెల్లడించారు. మందలపల్లి -1 సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్‌గా దొడ్డలింగప్పగారి మహాదేవి, మాల్లాపల్లికి రహీమ్‌బాను, పుల్లేరుకు ప్రశాంతిబాయి, గౌనివారిపల్లికి ప్రత్యూషా, గంగంపల్లికి తులసీరాం, మలసముద్రానికి షేక్‌మైనొద్దీన్, కొండాపురానికి అనితమ్మ, కమ్మవారిపల్లికి మేకల పూజిత, వానవోలు -2 సచివాలయానికి ప్రసాద్‌నాయక్ విధులు చేపట్టారు.

యువకుడి గొంతుకోసిన వ్యక్తి పోలీసుల అదుపులో..?

పెనుకొండ టౌన్, మార్చి 7: మద్యం మత్తులో యువకుడి గొంతు కోసిన వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. పోలీసులు అందించిన వివరాల మేరకు.. పెనుకొండకు చెందిన ఇన్సార్ పెనుకొండ జూనియర్ కళాశాలలో బుధవారం రాత్రిషె క్షావలితో గొడవపడి గొంతు కోశాడన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న షెక్షావలిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గొంతుకోసిన సంఘటన విని పెనుకొండలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ రాజేష్‌ను అడగ్గా ఇన్సార్ వద్ద షెక్షావలినగదు తీసుకున్నాడని ఈ లావాదేవీల్లో గొడవలు జరిగాయన్నారు. ప్రస్తుతం ఇన్సార్ అదుపులో ఉన్నట్లు తెలిపారు. ఇన్సార్ బేల్దార్ పనిచేస్తూ జీవనం సాగించేవాడన్నారు. కేసు నమోదుచేసి కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

మడకశిర రూరల్, మార్చి 7: మండలంలోని అయ్యావారిపల్లి వద్ద రోడ్డు దాటుతున్నా లక్ష్మీకాంతప్ప (60) అనే వృద్ధుడు వాహనం ఢీ కొనడం వల్ల అక్కడికక్కడేమృతి చెందారు. స్థానికులు అందించిన వివరాల మేరకు.. మృతుడు లక్ష్మీకాంతప్ప స్వగ్రామం బీ రాయపురం. అతడు గురువారం సాయంత్రం పనినిమిత్తం అయ్యావారిపల్లికి వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి 8 గంటలకు తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మడకశిర-హిందూపురం ప్రధాన రహదారిలో అయ్యావారిపల్లి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా హిందూపురం నుంచి అమరాపురం వెళ్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టింది ఈ ప్రమాదంలో ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూతుళ్లకు పెళ్లి అయింది. ఈ సంఘటనకు సంబంధించి మడకశిర పోలీసులకు సమాచారం అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఘనంగా వీరభద్రస్వామి గ్రామోత్సవం


పల్లకిలో దుర్గావీరభద్రస్వామి

లేపాక్షి, మార్చి 7: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షిలోని దుర్గావీరభద్రస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. మహాగణపతి సుదర్శన హోమం, స్వామివారి గ్రామోత్సవం, ధ్వజారోహణ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. దుర్గావీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, అర్చనలు చేశారు. సుదర్శన హోమానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

నేడు స్వామివారి కల్యాణం

మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. కల్యాణంతోపాటు రుద్రహోమం, దీపోత్సవం, నాలుగు యమపూజలు నిర్వహిస్తామన్నారు.

'అరాచకాలు భరించలేక టీడీపీలోకి..'


వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో నారా లోకేశ్

పెనుకొండ టౌన్, మార్చి 7 : వైసీపీ అరాచకాలు భరించలేక ఆ పార్టీని వీడి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీ కండువా వేయించుకున్నట్టు టీడీపీలో చేరిన నాయకులు తెలిపారు. పెనుకొండలో గురువారం జరిగిన శంఖారావం బహిరంగసభలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఆధ్వర్యంలో పరిగి మండలానికి చెందిన బీచిగానిపల్లి సర్పంచ్ బాలాజీ, ఎంపీటీసీ గంగాధరప్ప, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు చెన్నక్రిష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశులు, హనుమంతరెడ్డి, నరసింహారెడ్డి, బాబిరెడ్డి, అశోక్, అంజినాయక్, వికాస్‌సింగ్, కిరణ్‌నాయక్ తదితరులు టీడీపీలోకి చేరారు.

లోకేశ్‌ను కలిసిన పురం నాయకుడు మంగేష్


నారా లోకేశ్‌తో మంగేష్

హిందూపురం, మార్చి 7 : టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను హిందూపురానికి చెందిన టీడీపీ నాయకుడు మంగేష్ కలిశారు. ఆయన గురువారం శంఖారావం సభకు వచ్చి న యువనేతను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. హిందూపురం నియోజకవర్గానికి రావడం సంతోషంగా ఉందన్నారు. అల్లుడు అత్తగారింటికి వచ్చిన విధంగా మీరు ఇక్కడికి రావడం మా అందరికీ ఆనందంగా ఉందని మంగేష్ లోకేశ్‌తో అన్నారు.

'కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి'


సరస్వతి పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మడకశిర రూరల్, మార్చి 7: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయురాలు గిరిజమ్మ తెలిపారు. మండలంలోని రేకలకుంట ఉన్నత పాఠశాలో గురువారం పదో తరగతి విద్యుర్థులు సరస్వతి పూజ నిర్వహించారు. సరస్వతి దేవి చిత్రపటాన్ని ఉంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థు బాగాచదివి మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించాలని, పాఠశాలకు మంచి పేరు తీసురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సెలవు లేదు..

- మూడురోజులపాటు సంక్షేమ పథకాలు వివరించాలి
- ముఖ్యమంత్రి పేరుతో కరపత్రాలు
- వారేమైనా వైసీపీ కార్యకర్తలా అంటూ విమర్శలు



విడుదలైన కరపత్రం ఇదే..

రొద్దం, మార్చి 7 : రాష్ట్రంలో మహా శివరాత్రి తోపాటు రెండో శనివారం, ఆదివారం కలిసి రావడంతో వరుస సెలవులు కలిసి వచ్చాయని ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయు లు సంబరాలు చేసుకుంటున్నారు. కానీ సచివాలయ ఉద్యోగులకు మాత్రం నిరాశతో ఉండాల్సి వస్తుందేమో? వారికి ప్రభుత్వం మూడు రోజులపాటు నో లీవ్స్, నో పర్మిషన్ అంటూ ఆదేశించడంతో పాటు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు వివరించాలని హుకుం జారీచేసిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేరుతో ముద్రించిన కరపత్రాలు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లకాలంలో లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ , ఈకేవైసీ చేయించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ పాలనలో 129హామీలకు 128 అమలు చేశామని సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో కెళ్లి లబ్ధిదారులకు వైసీపీ కార్యకర్తల్లా వివరించడం ఏంటన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాడు - నేడుతో పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో నిర్మించామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా .... క్షేత్ర స్థాయిలో బిల్లులు రాక పనులు పూర్తికాక అర్ధంతరంగా నిలిచిపోయిన భవనాలు ఎన్నో ఉన్నాయి. అలాగే ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు పూర్తీచేసి రైతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామనడంలోనూ వాస్తవానికి విరుద్ధంగా ఉన్నాయి. ఎన్నికల సమయంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరించాలనడంలో అర్థమేముంది? మేము ఉద్యోగులమా, వైసీపీ కార్యకర్తలమా అని వారే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులు సెలవులు వస్తాయని సంబరపడిన సచివాలయ ఉద్యోగులకు నోలీవ్స్, నోపర్మిషన్స్ అన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో నోట్ల పచ్చివెలక్కాయ పడినట్లయింది. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి ఉద్యోగులంతా గ్రామబాట పట్టి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను కలవాల్సి ఉండటంతో దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు.